నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతాపసింగారం వ్యవసాయ ఫీడర్ పరిధిలోని రేణుకా ఎల్లమ్మ, మక్త, సాయిశ్రీ గార్డెన్, వితలేశ్వర కాలనీ, కొర్రెముల్, వెంకటాపూర్, తేనుగూడెం, టూబీహెచ్‌కే ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: లింగాలకుంట ఆలయ రోడ్డులో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య వైస్‌చైర్మన్ మాధవరెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాశివరాత్రి లోగా పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, అనురాధా, రవీందర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు షౌకత్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, శ్రీనివాస్, భానుప్రకాశ్, ఖయూమ్, నర్సింగ్‌రావు, బాబు, అండాలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మారుతీ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే మల్లారెడ్డి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గణేశ్ విగ్రహ ప్రతిష్ఠలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, ప్రణీతాగౌడ్, మాజీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, తేళ్ల శ్రీధర్, నిమ్మల శ్రీనివాస్, అనంతరెడ్డి, రాహుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావల్‌కోల్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలి

మేడ్చల్: మున్సిపాలిటీల్లో విలీనం కాగా మిగిలిన గ్రామాలకు మధ్యలో ఉన్న రావల్‌కోల్ గ్రామాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గోపని వెంకటేశం కోరారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.

చిత్తారమ్మ చెరువులో ఒకరి మృతదేహం లభ్యం

–మరొకరి కోసం గాలింపు

శామీర్‌పేట్: గండి చిత్తారమ్మ చెరువులో ఆదివారం ఇద్దరు గల్లంతు కాగా అందులో ఒకరి మృతదేహం సోమవారం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. జగద్గిరిగుట్టకు చెందిన ఆరుగురు యువకులు శామీర్‌పేట మండలం పొన్నాల్‌లోని గండి చిత్తారమ్మ ఆలయ దర్శనానికి వెళ్లారు. అందులో బాలు (25), సందీప్ సాగర్ (27) సమీప చెరువులో దిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు, ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లతో కలిసి చెరువులో గాలింపు చేపట్టగా సందీప్ సాగర్ మృతదేహం లభ్యమైంది. పంచనామా నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మరొకరి ఆచూకీ కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

విదేశాల్లో ఉపాధి అవకాశాలపై సదస్సు రేపు

మేడ్చల్: విదేశాల్లో ఉపాధి అవకాశాలపై టెక్నికల్ విద్యార్థుల కోసం ఈనెల 19న మేడ్చల్ ఐటీఐలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ హనుమ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ టామ్‌కెమ్ ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, రొమేనియా, యూకే, గల్ఫ్ దేశాల్లో నైపుణ్యం గల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆసక్తి, అర్హత గల విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని మహిళల వినతి

మేడ్చల్: ఆర్‌పీ మోసాలపై చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మున్సిపల్‌కు చెందిన డ్వాక్రా సంఘాల మహిళలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం వినతి పత్రాలు అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం లోనే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడ్చల్ కు చెందిన ఆర్‌పీ లోలాక్షి, ఆమె కుమారుడు క్రాంతికుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధి నరేశ్ రుణాల పేరిట మహిళలను మోసం చేశారన్నారు. ఆర్‌పీగా లోలాక్షి 18 గ్రూపులు ఏర్పాటు చేసి గ్రూపులకు తెలియకుండా గ్రూపు చొప్పున రూ.18 లక్షలు సొంతంగా లోన్ తీసుకుని చెల్లించలేదని, అలాగే రూ. కోటి 50 లక్షల రుణం ఇప్పిస్తానని మోసం చేసి రూ. 20 లక్షల డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. బ్యాంక్ అధికారులతో కుమ్మక్కై మోసం చేస్తున్న ఆర్‌పీ లోలాక్షిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాతాళానికి పానీ..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో క్రమంగా అడుగంటుతున్న భూగర్భ జలాలు

- ఈ జనవరిలో సగటున 1.83 మీటర్ల లోతుకు పడిపోయిన వైనం
- అత్యధికంగా ఉప్పల్‌లో 5.35 మీటర్ల డౌన్
- నీటి పొదుపునకు ప్రజల్లో అవగాహనపై చర్యలు
- గతేడాది జనవరితో పోల్చితే 13 మండలాల్లో తగ్గుముఖం
- ఘట్‌కేసర్, ఎంసీపల్లిలో నిలకడగా జలమట్టం


నీటి మట్టాన్ని లెక్కిస్తున్న భూగర్భజల వనరుల శాఖ ఉద్యోగులు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గతేడాది జనవరితో పోల్చుకుంటే, ఈఏడాది జనవరిలో సగటున 1.83 మీటర్ల లోతుకు పడిపోయింది. జిల్లాలోని 13 మండలాల్లో నీటి మట్టం కూడా గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ముదురుతున్న ఎండల నేపథ్యంలో జిల్లా భూగర్భ జల శాఖ నీటిని పొదుపుగా వాడుకోవాలని అవగాహనకు కార్యక్రమాలకు సన్నద్ధమవుతోంది. రానున్న 4 నెలల్లో ఎండలు మరింత తీవ్రం కానుండడంతో నీటి పొదుపు చాలా అవసరమని పేర్కొంటోంది. వర్షపు నీరు వృథాగా పోకుండా..ఇంటి ఆవరణలోనే ఇంకించుకునేలా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని జిల్లా భూగర్భ జల శాఖ సూచిస్తున్నది. రైతులు కూడా పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని కోరుతోంది. అలాగే ఆరుతడి పంటల మార్పిడికి సిద్ధం కావాలని పేర్కొంటోంది. ఎండిపోయిన బోరుబావులను రీచార్జి చేసుకునేలా అవశ్యకతపై దృష్టి సారించాల్సి అవసరముందంటోంది.

13 మండలాల్లో తగ్గిన జలం..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గతేడాది జనవరితో పోల్చుకుంటే జిల్లాలో సగటున 1.83 మీటర్ల లోతుకు జలమట్టం పడిపోయింది. మండలాల వారీగా పరిశీలిస్తే 13 మండలాల్లో లోతుకు పడిపోగా, మిగతా 2 మండలాల్లో నిలకడగా నీటి మట్టం ఉన్నట్లు భూగర్భజల శాఖ రికార్డులు పేర్కొంటున్నాయి. కూకట్‌పపల్లి మండలంలో అత్యధికంగా 18.79 మీటర్ల లోతుకు భూగర్భ జల మట్టం పడిపోయింది. తర్వాత స్థానంలో మల్కాజిగిరి, ఉప్పల్, దుండిగల్, మేడిపల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, బాలానగర్, శామీర్‌పేట, కాప్రా, మేడిపల్లి, కీసర, బాచుపల్లి మండలాలు ఉన్నాయి. జిల్లాలోని 13 మండలాల ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా భూగర్భజల శాఖ కోరుతున్నది. మరో 2 మండలాల్లో మాత్రం భూగర్భ జలమట్టం నిలకడగా ఉంది. ఎంసీపల్లిలో మండలంలో గతేడాది (2024)జనవరితో పోల్చితే ఈ ఏడాది (2025) జనవరిలో 0.73 మీటర్ల భూగర్భ జలమట్టం పెరిగింది. అలాగే, ఘట్‌కేసర్ మండలంలో 0.45 మీటర్ల జలమట్టం పెరిగింది. అయినప్పటికీ ముదురుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని నీటి పొదుపును పాటించాలని భూగర్భజల శాఖ జిల్లా ప్రజలను కోరుతోంది.

మేడ్చల్ జిల్లాలోని 15 మండలాల్లో గతేడాదితో పోల్చుకుంటే భూగర్భ జలాల పరిస్థితి

మండలం	జనవరి 2024	జనవరి 2025	తేడా
అల్వాల్	9.33	9.53	0.20
బాచుపల్లి	4.49	6.85	2.36
బాలానగర్	8.01	8.80	0.80
దుండిగల్	12.75	14.93	2.18
ఘట్కేసర్	7.01	6.57	0.45
కాప్రా	4.17	5.11	0.94
కీసర	7.57	9.45	1.88
కూకట్‌పల్లి	11.95	18.79	6.84
ఎంసీపల్లి	16.34	15.61	0.73
మల్కాజిగిరి	15.69	17.60	1.91
మేడ్చల్	7.94	11.20	3.26
మేడిపల్లి	13.00	13.93	0.94
కుత్బుల్లాపూర్	7.37	10.68	3.31
శామీర్‌పేట్	5.00	6.49	1.49
ఉప్పల్	6.29	11.65	5.35
జిల్లా సగటు	9.38	11.21	1.83


కంప్యూటర్ ల్యాబ్‌లో..

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

శామీర్‌పేట్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ (జగద్గిరిగుట్ట) కళాశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా.. మౌలిక వసతులు, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? లేదా..? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ చార్ట్, వంటశాల, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, ప్రిన్సిపాల్ ఇశ్రత్ తదితరులు పాల్గొన్నారు.


వంటశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వైభవంగా కల్యాణోత్సవాలు

కీసర: కీసర, చీర్యాల, రాంపల్లిలో సోమవారం మల్లన్న ఆలయాల వద్ద కేతమ్మ, శ్రీ భ్రమరాంబ, సమేత శ్రీ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం భక్తులు బోనాలు సమర్పించారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కాంగ్రెస్ నేతలు కోలకృష్ణాయాదవ్, రామిడి విజయ్‌రెడ్డి, శ్వేత నాగరాజు, జంగయ్య యాదవ్, ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గౌడవెల్లిలో మల్లన్న కల్యాణం

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గౌడవెల్లి ఆలయంలో సోమవారం మల్లన్న కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.


డోలు కొడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

అలాగే స్వామి వారికి బోనాలు సమర్పించారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి తదితర నేతలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గౌడవెల్లి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హంగామా..

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తన మార్కు హంగామా చేశారు. సంప్రదాయ డోలు కళాకారుల నుంచి తీసుకుని ఒగ్గు కథకు అనుగుణంగా వాయించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


వెంకన్న

ఘట్‌కేసర్: వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా చిట్యాల్ మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన రూపాని వెంకన్న (49) 2 రోజుల క్రితం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ మండలానికి ఉపాధి కోసం వెళ్లాడు. అయితే అక్కడ పని దొరకకపోవడంతో ఇంటికి వస్తున్నట్లు ఆదివారం భార్యకు సమాచారం ఇచ్చాడు. సోమవారం బైక్‌పై ఇంటికి వస్తుండగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ సమీపంలో బైక్‌ను పక్కన నిలిపి కల్వర్టు వద్ద పడిపోయి మరణించి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడి ముఖం, నుదుటిపై చిన్న గాయం కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నర్సరీ స్థలాన్ని కాపాడాలని వినతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్–648, 704లో కేటాయించిన నర్సరీ, క్రీడా మైదానాల స్థలాన్ని కాపాడాలని మేడ్చల్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రేషన్ లక్ష్మణ్ కోరారు. ఈమేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలకు రక్షణగా ఫెన్సింగ్ వేసి కాపాడాలని, కబ్జాదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. ఆయన వెంట స్థానిక యువకులు పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

మేడ్చల్: కులగణన సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారు రీసర్వేలో తమ వివరాలు అందించాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ఉ.9 నుంచి సా.5 గంటల్లోపు సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యాలయానికి వచ్చేందుకు వీలు కానీ వారు టోల్ ఫ్రీ నంబర్ 040–21111111 ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు


గౌడవెల్లిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌రావు

మేడ్చల్/మేడ్చల్‌రూరల్: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపీ సంతోష్‌రావు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి గౌడవెల్లిలోని సాకేత్‌లో ఆదివారం మొక్కలు నాటి కేక్ కట్ చేశారు. అలాగే కృషి హోంలో అనాథ పిల్లలతో కలిసి కేసీఆర్ పుట్టిన రోజును నిర్వహించి పిల్లలతో కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు భాస్కర్‌యాదవ్, దయానంద్ యాదవ్, సుదర్శన్ పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్ చౌరస్తాలో మాజీ మేయర్ కావ్య ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, మేక లలితాయాదవ్, సంగీతారాజశేఖర్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండల ముదిరాజ్, జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, జవహర్‌నగర్ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు సుధాకర్‌చారి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీలో..

కీసర: నాగారం మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో మున్సిపల్‌పరిధిలోని మానస ఎల్డర్స్ హోంలో వృద్ధులకు పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు మోకు జగన్మోహన్‌రెడ్డి, నిమ్మల శ్రీనివాస్, కౌకుట్ల అనంతరెడ్డి, అన్నం రాజు శ్రీనివాస్, శ్రీకాంత్‌యాదవ్, కొమురెల్లి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మల్లారెడ్డి యూనివర్సిటీలో ముగిసిన జాతీయ సదస్సు


సదస్సులో రమణారావు, వీఎస్‌కే రెడ్డి,అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో 2 రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం (ఎన్ఈపీ) 2020 విధి విధానాలు నిర్వహించిన సదస్సులో ఎన్ఐటీ రాయ్‌పూర్ చాన్స్‌లర్ ఎన్‌వీ రమణారావు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ పాల్గొని దేశంలోని వివిధ విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల్లోని పాఠ్య ప్రణాళికల ప్రామాణీకరణ ఆవశ్యకత, సమగ్ర విద్య లక్ష్యాలు చేరుకునేందుకు విద్యార్థులు, అధ్యాపకులు వారి ఆలోచనా విధానంలో తీసుకురావాల్సిన మార్పులను వివరించారు. ముగింపు కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ చాన్స్‌లర్ బీఎస్ మూర్తి ఎన్ఈపీ 2020 అమలులో వినూత్న పద్ధతుల గురించి సమగ్రంగా వివరించారు. సదస్సులో వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు నీరజ్‌కుమార్, శారద, కోటేశ్వర్‌రావు ప్రసంగించారు. ఎన్ఈపీ విధానం వలన ముందుగా విద్యార్థులకు ఆపై సమాజానికి, దేశానికి కలిగే ప్రయోజనాలు, అమలు చేసే అవకాశాల గురించి చర్చించాలనే ఉద్దేశంతో సదస్సు నిర్వహించినట్లు మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి తెలిపారు. విద్యా రంగ నిపుణులు, విధాన రూపకర్తలు, పరిశోధకులు, ఇతర దిగ్గజాలు పాల్గొని చర్చించారని వివరించారు. వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేకే..

యువకుడి హత్య కేసులో నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలో ఆదివారం జరిగిన దారుణ హత్య కేసులో నిందితులను మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మేడ్చల్ జోన్ డీసీపీ కోటి రెడ్డి వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా, సోమారప్పేట గ్రామానికి చెందిన గుగులోతు గన్యా పెద్ద కుమారుడు ఉమేశ్ (24) మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను తరచూ కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన అతడి సోదరుడు రాకేశ్, చిన్నాన్న కుమారుడు లక్ష్మణ్, బంధువులు బుక్యా నవీన్ బుక్యా నరేశ్, బుక్యా సురేశ్‌తో కలిసి అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఆర్టీసీ కాలనీలోని అతడి ఇంటిపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ సందర్భంగా నవీ, నరేశ్, సురేశ్ ఉమేషను పట్టుకోగా రాకేశ్, లక్ష్మణ్ కత్తులతో దాడి చేశారు. వారి నుంచి తప్పించుకున్న ఉమేష్ పారిపోతుండగా అతడిని వెంబడించిన రాకేశ్, లక్ష్మణ్ మేడ్చల్ బస్ డిపో ఎదుట జాతీయ రహదారిపై కత్తులతో పొడిచి హత్య చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మేడ్చల్ పోలీసులు సోమవారం ఉదయం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతుడు ఉమేశ్‌కు నేర చరిత్ర ఉందని, అతడిపై కామారెడ్డి జిల్లాలో 14 కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసును గంటల వ్యవధిలో ఛేదించిన ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణ, డీఐ సుధీర్ కృష్ణ, ఎస్సై మన్మథరావును డీసీపీ అభినందించారు.

పట్టుదలతో చదివితేనే లక్ష్య సాధన


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

- మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ పోట్రు
- కిష్టాపూర్ రెసిడెన్షియల్ పాఠశాల, కాలేజీ తనిఖీ

మేడ్చల్: పట్టుదలతో చదివితేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ పోట్రు అన్నారు. కిష్టాపూర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలను సోమవారం సందర్శించారు. సిలబస్, వసతులు, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని, మెనూ చార్ట్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కళాశాల, పాఠశాలలో మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరగా అంచనాలు అందించాలని సూచించారు. డ్రైనేజీ, ప్రహరీ నిర్మాణాలు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట తహసీల్దార్ శైలజ, ప్రిన్సిపాల్ లలిత, జోనల్ ఆఫీసర్ రజిత ఉన్నారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

‘ప్రజావాణి’లో 77 ఫిర్యాదులు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డికి 77 ఫిర్యాదులను అందజేశారు.

–ఉద్దమర్రి గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికులు 5 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని మిగతా జీపీల్లోనూ ఇదే పరిస్థితి ఉందని మొర పెట్టుకున్నారు.

–ఇటీవల సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించామని, దీనికి సంబంధించిన 200 మందికి డబ్బులు చెల్లించలేదని జవహర్‌నగర్ నగరపాలక సంస్థకు చెందిన ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. అలాగే పలువురు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అక్రమ భవన నిర్మాణాలు, భూకబ్జాలు తదితర వాటిపై కూడా స్థానికులు ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే తీసుకున్న చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-I (SPECIAL DISTRICT JUDGE) AT TIRUVALLUR

M.C.O.P.No.103/2024

1. Tmt. Lavanya,
2. Minor. Selvaraghavan,
3. Minor. Vishnu,
4. Tmt. Ramani,
5. Mr. Thangaraj ...Petitioners

VS

1. Beete Bhaskar Yadav,
2. The Manager, Chola Ms General Ins Co. Ltd. ...Respondents

To,
Mr. Beete Bhaskar Yadav,
H.No.6-281, Weekar Section Medchal,
Medchal S.O. K.V.Rangareddy,
Telangana. PIN-501401 ...1st Respondents

NOTICE

It is hereby submitted that the above petitioners filed the above case against you. The above said case is posted on 25.02.2025 for your appearance if you have any objections you may appear in person or through your counsel at the said court at 10.00 A.M. Otherwise the matter will be set exparte in your absence.

G. RAJARENIN
Counsel for the petitioner's